సాక్షి
తిరుపతి
గురువారం । 20 । జూలై । 2023



ప్రజలను నమ్ముకున్న సీఎం జగనన్న

ప్రజలు, దేవుడిని నమ్ముకున్న నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి తెలిపారు. - 8లో



మోహిత్‌రెడ్డికి బ్రహ్మరథం

పాకాలలోని పంటపల్లెలో వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	36	28
చిత్తూరు	34	27
తిరుమల	30	23
గూడూరు	36	29
నగరి	36	28

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 64,003 మంది స్వామివారిని దర్శించుకోగా.. 24,659 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.06 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

23న బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : చిత్తూరు జిల్లా బాయ్స్ అండ్ గర్ల్స్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన తుమ్మలగుంట వైఎస్సార్ క్రికెట్ మైదానంలో అండర్–16 బాలుర క్రికెట్ జట్టును ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు మాడ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికకు 01-09-2007 నుంచి 01-09-2009 మధ్యలో జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఆరోజు ఉదయం గంటలకు తెల్లని దుస్తులతో సొంత క్రికెట్ కిట్టు, ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 98490 26131, 79818 80281నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన కోరారు.

బదిలీలకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎంఈఓ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది బదిలీలకు దరఖాస్తులు చేసుకోవచ్చని సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి బుధవారం పేర్కొన్నారు. సీఆర్‌పీ, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు బదిలీలకు ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను ఎంఈఓ మెయిల్స్‌కు పంపినట్లు పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను చిత్తూరు జిల్లా కేంద్రంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో గడువులోపు అందజేయాలని తెలిపారు.

24న స్పాట్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్

తిరుపతి ఎడ్యుకేషన్ : ఐసీసీలో ఉత్తీర్ణులై డిప్లొమో ద్వితీయ సంవత్సరంలో ప్రవేశానికి అర్హత పొందిన అభ్యర్థులకు ఈనెల 24వ తేదీన తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సమీప పాలిటెక్నిక్ కళాశాలల్లో దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. 24న అర్హత ఉన్న అభ్యర్థులకు స్పాట్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.


5లోగా శ్రీనివాస సేతు పూర్తి



పనులపై సమీక్షిస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుపతి కల్చరల్: శ్రీనివాస సేతు నిర్మాణ పనులు ఆగస్టు 5వ తేదీ నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి ఆదేశించారు. బుధవారం టీటీడీ పరిపాలన భవనంలోని తన చాంబర్‌లో టీటీడీ, మున్సిపల్ అధికారులతో శ్రీనివాస సేతు నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ రైల్వే ఓవర్ బ్రిడ్జిపైన గడ్డర్స్ ఏర్పాటు పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ హరితకు సూచించారు. నిర్మాణ పనులకు అడ్డంకిగా ఉన్న భూగర్భ విద్యుత్ వైర్లను తొలగించేందుకు తగినంత మంది సిబ్బందిని నియమించాలని ఏపీఎస్‌పీ డీసీఎల్ సీఎండీ సంతోష్ రావుకు సూచించారు. సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి, జేఈవో సదా భార్గవి, సీఈ నాగేశ్వర రావు, మున్సిపల్ ఎస్ఈ మోహన్, ఈఈ చంద్రశేఖర్, ఆఫ్కాన్స్ ప్రతినిధి రంగస్వామి పాల్గొన్నారు.

శ్రీసిటీలో ఎస్పీడీసీఎల్ సీఎండీ



సీఎండీకి స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ఎండీ

సత్యవేడు: ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష్ రావ్ బుధవారం శ్రీసిటీని సందర్శించారు. ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న ఆయన పరిశ్రమల విద్యుత్ వినియోగంపై సమీక్షించారు. టెక్నికల్ విభాగానికి చెందిన విద్యుత్ అధికారులు మాట్లాడుతూ పరిశ్రమలు వినియోగించే విద్యుత్ వ్యవస్థలు, విధానాల్లో తలెత్తే కొన్ని లోపాలను వివరించడంతో పాటు చేయాల్సిన పనులను సూచించారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఎస్పీడీసీఎల్ సీజీఎం (ఫైనాన్స్) ధర్మజ్ఞాని, సీజీఎం (ఆపరేషన్స్) గురవయ్య, తిరుపతి సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భయం వీడండి..
అండగా ఉన్నాం

- ధైర్యం చెబుతూ, బాధలు తీరుస్తూ సాగిన పల్లెబాట
- జనంతో మంత్రి మమేకం



శివరామపురంలో ఎడ్ల బండిపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్, ఎంపీ, ఎమ్మెల్సీ

శాంతిపురం: 'ఎవరికో భయపడి ఓట్లు వేయడం. వాళ్ల మాట వినకపోతే ఇబ్బందులు పెడతారనే ఆందోళన వద్దు. మీకు అండగా సీఎం, నేను, మన వాళ్లంతా ఉన్నాం..ధైర్యంగా ఉండండి.' అని రాష్ట్ర విద్యుత్, గనులు, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుప్పం ప్రజలకు భరోసా ఇచ్చారు. శాంతిపురం మండలంలో పల్లెబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మంత్రి 11 పంచాయతీల్లో పర్యటించారు. అన్ని చోట్లా స్థానిక ప్రజలతో మమేకం అవుతూ వారిలో ధైర్యం నింపారు. కుప్పంపై ప్రత్యేక దృష్టి సారించడంతో టీడీపీ నాయకుల దౌర్జన్యాలు ఇక సాగబోవని తేల్చి చెప్పారు. జనాన్ని భయభ్రాంతులకు గురిచేసే రాజకీయాలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మేలు జరిగి ఉంటేనే వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను ఆదరించాలని కోరారు. బెదిరించి, అబద్దాలు చెప్పి ఎన్నికల్లో గెలవడం తమ పార్టీ విధానం కాదని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా, 35 ఏళ్ల నుంచి వరుసగా ఇక్కడ శాసనసభ్యుడిగా గెలుస్తున్నా ప్రజల కష్టాలు పట్టించుకోక, కనీస వసతులు కల్పించక నిర్లక్ష్యం చేయటాన్ని ఎండగట్టారు. గ్రామాలకు కనీసం సరైన రోడ్డు సౌకర్యం కల్పించడంలోనూ బాబు వైఫల్యాన్ని ప్రశ్నించారు. పాలారు ప్రాజెక్టు నిర్మించకుండా తమిళనాడుతో కలిసి కుట్రపూరితంగా కేసులు వేయించిన బాబు తీరును ఎండగట్టారు. ప్రజల నుంచి సమస్యలపై పెద్ద ఎత్తున వస్తున్న అర్జీలను స్వీకరిస్తూ, వాటి పరిష్కారానికి ఎక్కడికక్కడ అధికారులకు ఆదేశాలు ఇస్తున్నారు. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం 2019 ఎన్నికల ముందు చంద్రబాబు తెరమీదికి తెచ్చి, అర్థాంతరంగా వదిలేసిన అంశాలపైనా దృష్టి సారించారు. హంద్రీనీవా కుప్పం కెనాల్‌ను త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. బలిజ భవన్ కోసం కుప్పంలో స్థలంతో పాటు నిధులను మంజూరు చేయించిన మంత్రి, తాజాగా కురబ కులస్తుల కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేయించారు.

తీరంలో అలజడి

వాకాడు: వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరిత ఆవర్తనం అల్పపీడనంగా మారుతున్న నేపథ్యంలో బుధవారం వాకాడు మండలం తూపిలిపాళెం సముద్ర తీరంలో అలల ఉధృతి పెరిగింది. సముద్రం 5 నుంచి 7 మీటర్లు వరకు ముందుకు రావడంతో కెరటాలు 4 మీటర్లు ఎత్తుకు ఎగసిపడుతున్నాయి. తీర ప్రాంతంలోని తూపిలిపాళెంతో పాటు దుగ్గరాజపట్నం, అంజలాపురం, కొండూరుపాళెం తదితర గ్రామాల మత్స్యకారులు వేటను మధ్యాహ్నం నిలిపి వేశారు. వాతావరణంలో ఒక్కసారిగా అనూహ్యమైన మార్పులు చోటు చేసుకోవడంతో ఆకాశం నల్లని మబ్బులతో చీకట్లు కమ్ముకుని సన్నని తుంపర్ల వర్షం పడుతుంది.



తూపిలిపాళెం వద్ద సముద్రంలో అలల ఉధృతి

వెంకటగిరికి రేపు
సీఎం వైఎస్ జగన్ రాక



సీఎం సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

- సభాస్థలి, హెలీప్యాడ్ పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు
- పట్టణంలో భారీ స్వాగత తోరణాలు, ఫ్లెక్సీల ఏర్పాటు

వెంకటగిరి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 21వ తేదీన వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ఐదో విడత ప్రారంభోత్సవానికి వెంకటగిరి రానున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలో భారీ స్వాగత ఏర్పాట్లు జరుగుతున్నాయి. పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో భారీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. సభాప్రాంగణంలో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. వేలాదిమంది ప్రజలు సభలో కూర్చునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏర్పాట్లను బుధవారం ఉపముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, ఎంపీ డాక్టర్ ఎం గురుమూర్తి, సూళ్లూరుపేట, సత్యవేడు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, కె.ఆదిమూలం, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వరప్రసాద్ రావు, ఎమ్మెల్సీలు చంద్రశేఖర్‌రెడ్డి, బల్లి కల్యాణచక్రవర్తి,సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం పరిశీలించారు. వారి కి ఏర్పాట్ల వివరాలను జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి, మంత్రి, ఎమ్మెల్యేలకు వివరించారు. ఈసందర్భంగా ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ జిల్లాలో చేనేత కార్మికులు ఎక్కువగా ఉండే వెంకటగిరిలో వైఎస్సార్ నేతన్ననేస్తం ఐదోవిడత కార్యక్రమం ప్రారంభించడం ఈ ప్రాంతం అదృష్టమని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా చేనేత కార్మికులకు ఏటా రూ.24,000 సాయం చేస్తూ ఆర్థికంగా అండగా నిలుస్తుండడంతో మళ్లీ చేనేతరంగం పూర్వవైభవం దిశగా పయనిస్తుందని తెలియజేశారు.

అధికారులకు కలెక్టర్ సూచనలు

జిల్లా కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి, జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తొలుత సీఎం హెలీప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి సభాస్థలికి వెళ్లే మార్గాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పట్టణంలోని త్రిభువని సెంటర్‌లో దివంగత సీఎం నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించనున్న నేపథ్యంలో ఆ ప్రాంతంలో అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్, గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, కమిషనర్ బీవీ రామయ్య, వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా ప్రచారం విభాగం అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి ఉన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు



సూచనలిస్తున్న కలెక్టర్ వెంకట రమణారెడ్డి

రేణిగుంట : ఈనెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి ఆదేశించారు. జిల్లాలోని వెంకటగిరిలో 'వైఎస్ఆర్ నేతన్న నేస్తం' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొంటున్న నేపథ్యంలో బుధవారం రేణిగుంట విమానాశ్రయంలో ఆయన జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డితో కలసి ఏఎస్ఎల్ (ముందస్తు భద్రత లైజన్) సమావేశం నిర్వహించారు.

సీఎం పర్యటన ఇలా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన వివరాలను జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి వివరించారు. ముఖ్యమంత్రి ఈనెల 21న ఉదయం 9.15 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి హెలీక్యాప్టర్‌లో 9.45 గంటలకు వెంకటగిరి విశ్వోదయ జూనియర్ కళాశాల గ్రౌండ్ హెలిపాడ్ చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 10.05 గంటలకు బహిరంగ సభ ప్రాంగణం చేరుకుని వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని ప్రారంభించి, ప్రసంగిస్తారు.

నిబద్ధత లేని బాబు, పవన్

తిరుపతి మంగళం : రాష్ట్రంలో టీడీపీ, జనసేన పొత్తులు సర్కస్ కంపెనీలో ఆటల్లా ఉన్నాయే తప్ప ఒక రాజకీయ నిబద్ధత లేదని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి విమర్శించారు. తిరుపతి 7వ డివిజన్‌లో బుధవారం గడప గడప కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. చంద్రబాబుతో కలిసి పోటీ చేస్తానంటున్న పవన్‌కళ్యాణ్ ఎన్డీయే సమావేశానికి వెళ్లడమేమిటని ప్రశ్నించారు. ఎన్డీయే సమావేశానికి చంద్రబాబును బహిష్కరిస్తే పవన్‌కల్యాణ్ వెళ్లడంలో ఆంతర్య మేమిటని ప్రశ్నించారు. చంద్రబాబును బహిష్కరించిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో పవన్‌కల్యాణ్ మిత్రపక్షంగా ఉంటూ ఎన్డీయే సమావేశానికి ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉంటూ పేదప్రజల మనసు గెలుచుకున్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించడమే వారు లక్ష్యంగా పెట్టుకున్నారే తప్ప రాజకీయ లక్ష్యం ఏ ఒక్కరిలోనూ లేదన్నారు. దేశ చరిత్రలోనే ఎవ్వరికీ సాధ్యం కానన్ని సంక్షేమ పథకాలు అందించి రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన గొప్ప నాయకుడు జగనన్న అన్నారు. ప్రజలంతా మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్న తపనతో ఉన్నారని తెలిపారు. ప్రజాబలం ఉన్న జగన్‌మోహన్‌రెడ్డిని ఎలాగైనా ఓడించాలన్న దురాలోచనలతో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ విష్రప్రయత్నాలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎన్ని ఎత్తులు వేసి ఎన్ని పార్టీలతో పొత్తులు పెట్టుకున్నా చివరకు చిత్తుచిత్తు కావడం తథ్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలు జగనన్నను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజాదరణ మెండుగా ఉన్న నాయకుడు జగనన్న అయితే ప్రజలు చీదరించుకునే నాయకులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమన

ఉద్యమంలా జగనన్న సు'రక్ష'

ప్రజా సమస్యలను సంతృప్తి స్థాయిలో పరిష్కరించడం, అర్హులెవరూ మిగిలిపోకుండా పథకాలను అందించడమే లక్ష్యంగా గతనెల 23వ తేదీ జగనన్నకు చెబుదాం'కు అనుబంధంగా ప్రారంభమైన 'జగనన్న సురక్ష' కార్యక్రమం జిల్లాలో ఉద్యమంలా పండుగ వాతావరణంలో జరుగుతోంది. అర్హులుగా గుర్తించిన వారిని సచివాలయాల వద్దకు ఆహ్వానించి వారికి అవసరమైన సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు అదే రోజు అందజేస్తు అధికార యంత్రాంగం రికార్డు సృష్టిస్తోంది. ప్రభుత్వ పథకాల లబ్ధిని అందిస్తోంది. ఇప్పటి వరకు జిల్లాలోని 34 మండలాల్లో 434 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. అందిన వినతుల్లో 94.16 శాతం పరిష్కారం అయ్యాయి.

- పేదలకు రక్ష..జగనన్న సురక్ష
- సంక్షేమ పథకాల సమస్యలకు తక్షణ పరిష్కారం
- ప్రజా సమస్యలు సంతృప్తి స్థాయిలో పరిష్కారం.
- ఇంటి వద్దనే 11 రకాల ప్రభుత్వ సేవలు పొందుతున్న జనం
- సర్వీసు చార్జీలు లేకుండా సర్టిఫికెట్లు
- ఇప్పటివరకు జిల్లాలో 2.89 లక్షల మందికి సేవలు
- 94.16 శాతం సమస్యల వినతుల పరిష్కారం

నాడు :

పింఛన్, కుల ధ్రువీకరణ పత్రం, బర్త్ సర్టిఫికెట్, ఇంకా ఏ ఇతర అవసరానికి అయినా కార్యాలయాల చుట్టూ రోజులు, నెలల తరబడి కాళ్లు అరిగేలా తిరిగాల్సి వచ్చేది. అంత తిరిగినా.. టీడీపీ నాయకుడు చెప్పాలి. అంతటితో పని అవుతుందని గ్యారెంటీ లేదు. చివరకు చెయ్యి తడిపితే గాని పని అయ్యే పరిస్థితులు కనిపించేవి కావు.

నేడు:

జగనన్న సురక్ష.. పేదలకు రక్షగా మారింది. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. దరఖాస్తు అవసరం లేదు. వలంటీర్ ప్రతి గడపకు వచ్చి సమస్య తెలుసుకుంటారు. స్వయంగా దరఖాస్తు పూర్తి చేసి, సచివాలయాల్లో అందజేసి, అర్హులైన లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ పథకాలు చేరుస్తున్నారు. 11 రకాల సేవలకు ఎలాంటి సర్వీసు చార్జి లేకుండా ఉచితంగా సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. కుల ధ్రువీకరణ పత్రం అందుకున్న విద్యార్థి.. రేషన్ కార్డు తీసుకున్న ఇంటి పెద్ద.. ఇల్లు మంజూరు పత్రాన్ని పొందిన మహిళ.. పంట నష్ట పరిహారానికి అర్హత సాధించిన రైతు.. వాహన మిత్ర పథకంలో లబ్ధిదారునిగా చేరిన డ్రైవరు.. ఇలా ఒకరేమిటి.. అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ సేవలు ఉచితంగా అందుతుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వెంకటగిరి నియోజకవర్గం బాలాయపల్లి మండలం మన్నూరులో జగనన్న సురక్ష క్యాంపులో సర్టిఫికెట్‌లు అందజేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి



తిరుపతిలో జగనన్న సురక్షలో సర్టిఫికెట్లు పొందిన వారితో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి (ఫైల్ ఫొటోలు)

సాక్షి, తిరుపతి : జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు వరంలా మారింది. దరఖాస్తుదారులకు పైసా ఖర్చు లేకుండా అన్ని ఉచితంగా లభిస్తుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. జిల్లాలోని 34 మండలాల్లోని 691 సచివాలయాలకు గాను ఇప్పటి వరకు 434 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. 3,80,364 కుటుంబాల సర్వే పూర్తి చేశారు. వివిధ సంక్షేమ పథకాలకు తమను అర్హులు చేయాలని, వివిధ సర్టిఫికెట్లు జారీ చేయాలని, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, సీసీఆర్ కార్డు మొదలైన వాటి కోసం వలంటీర్ల సర్వేలో 3,06,519 దరఖాస్తు చేయగా 2,88,621 మందికి సేవలను అందించారు. ఇప్పటి వరకు జిల్లాలో అందిన వినతులలో 94.16 శాతం పరిష్కారం అయ్యాయి. అధికారులు టీమ్‌లుగా జిల్లాలో మండలాల వారీగా ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తూ సమస్యలు పరిష్కరిస్తున్నారు. రోజూ నియోజకవర్గ, మండల స్పెషల్ ఆఫీసర్లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తు వేగంవతం చేస్తున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం చారిత్రాత్మకమని సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

ఇప్పటి వరకు వివిధ శాఖలు అందించిన సేవలు	
రెవెన్యూ	2,79,132
ఆధార్	8098
పౌర సరఫరాల శాఖ	1022
వైద్య ఆరోగ్య శాఖ	138
వ్యవసాయ శాఖ	107
రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ	27
రూరల్ డెవలప్మెంట్	07
కార్మిక శాఖ	01
గ్రామ/వార్డు సచివాలయాలు	90

ఉచితంగా సర్టిఫికెట్ అందుకున్నా



నా పేరు జ్యోతి. పుత్తూరు ఎన్‌జీఓ కాలనీ. నాకు కుల ధ్రువీకరణ పత్రం అవసరమైంది. సచివాలయం వద్దకు వెళ్లి అడగ్గా, జగనన్న సురక్ష కింద వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి అన్ని వివరాలు తీసుకుని, నాతో దరఖాస్తు చేయించి సచివాలయంలో ఇచ్చారు. అధికారుల పరిశీలన అనంతరం ఎలాంటి సర్వీసు చార్జీలు లేకుండా ఉచితంగా సర్టిఫికెట్ అందజేయడం చాలా సంతోషంగా ఉంది.

సమస్య పరిష్కారం అయ్యింది



నా పేరు సుబ్బమ్మ, వెంకటగిరి మండలం ఒకటో వార్డు. వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నా. రైస్ కార్డు లేక ప్రభుత్వ పథకాలు అందడం లేదు. జగనన్న సురక్ష కార్యక్రమంలో రైస్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోగా అధికారులు మంజూరు చేశారు. నాకు చాలా సంతోషంగా ఉంది. మా లాంటి నిరుపేద ప్రజలకు అండగా ఉన్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

సర్వే వేగవంతం



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పౌరసేవల కోసం సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా సర్వే వేగవంతం చేశాం. సర్వేలో లబ్ధిదారులను గుర్తించి 11 రకాల సర్టిఫికెట్లను వారి గడప వద్దకే అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. అర్హులై ఉండి పథకాలు పొందని వారిని గుర్తించి లబ్ధి పొందేలా చూస్తున్నాం. జిల్లాలో మండలాల వారీగా ప్రత్యేక క్యాంపులు నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తున్నాం. రోజూ నియోజకవర్గ, మండల స్పెషల్ ఆఫీసర్లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు.

–కె. వెంకటరమణారెడ్డి, తిరుపతి జిల్లా కలెక్టర్.

మహిళ మెడలో బంగారు చైన్ చోరీ

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని అగ్రహారపేటలో ఇంటి ఆవరణలో చెట్టు వద్ద పూలు కోసుకుంటున్న నవనీతమ్మ అనే మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తి బుధవారం బంగారు సరుడు లాక్కొని పరారయ్యాడు. ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం మేరకు.. నవనీతమ్మ బుధవారం తెల్లవారు జామున 5 గంటల ప్రాంతంలో ఇంటి ముందు ఉన్న చెట్టు వద్ద పూలు కోస్తోంది. గుర్తు తెలియని వ్యక్తి వెనుక నుంచి ఆకస్మాత్తుగా మెడలో ఉన్న 3 సవర్ల బంగారు సరుడును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శ్రీకాంత్ కేసు నమోదు చేశారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

- రైతు భరోసా కేంద్రాలకు గ్లోబల్ అవార్డు గర్వకారణం
- గూడూరులో రైతు బజార్‌ను ప్రారంభించిన మంత్రి కాకాణి


రైతు బజార్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

గూడూరురూరల్ : ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గూడూరులో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రూ.1.15 కోట్ల వ్యయంతో నిర్మించిన రైతు బజార్‌ను బుధవారం ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ్ చక్రవర్తి, మేరిగ మురళీధర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రైతుకు గిట్టుబాటు ధరతోపాటు కొనుగోలుదారులకు తక్కువ ధరకే రైతు బజార్‌లో తాజా కూరగాయలు అందుతాయని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉండేదని, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి జనరంజక పాలన అందిస్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాల్లో కూడా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ప్రజాబలం ఉన్న సీఎం జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. రైతు బజారులో వసతులకు సంబంధించి ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు రూ.50లక్షలు నిధులు అడిగారని, ప్రతిపాదనలు పంపితే మంజూరు చేస్తామని తెలిపారు.

ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి

గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ హామీలన్నీ అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతు బజార్‌కు రూ.1.15 కోట్లు, ఆస్పత్రి భవనాలకు రూ.22 కోట్లు, అర్బన్ హెల్త్ సెంటర్, కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. గూడూరులో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, నిర్మాణం పూర్తి చేసుకున్న టవర్‌క్లాక్, మహనీయుల విగ్రహాలను కూడా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ఎమ్మెల్సీ మురళీధర్ మాట్లాడుతూ రైతులందరూ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఎక్కడా లేని విధంగా గూడూరులో రైతు బజార్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవసేనమ్మ, ఏఎంసీ చైర్మన్ యమునమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కోడూరు కల్పలత, ఏఎంసీ వైస్ చైర్మన్ కొట్టు గోవర్ధన్, జెడ్పీటీసీ సభ్యులు ఊటుకూరు యామిని, మన్నెం శీనయ్య, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, బత్తిని విజయకుమార్, కో దూరు మీరారెడ్డి, పట్టణ, రూరల్ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజలను నమ్ముకున్న నేత సీఎం జగనన్న

- ఓర్వలేకే ప్రభుత్వంపై చంద్రబాబు, పవన్ విమర్శలు
- సొంతపార్టీవారికి దోచిపెట్టే నైజం చంద్రబాబుది
- ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి



వెంకటగిరి: ప్రజలు, దేవుడిని నమ్ముకున్న నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి తెలిపారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, శ్రేణులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు నాయుడు తనకు ఓటు వేసిన వారిగా న్యాయం చేస్తానని చెప్పారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా పేదరికమే అర్హతగా నవరత్నాల పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పెరుగుతున్న ప్రజాదరణను ఓర్వలేక ప్రభుత్వంపై ఎల్లోమీడియాతో కలిసి చంద్రబాబు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. పేద ప్రజలకు ఉన్నత విద్య, మెరుగైన వైద్యం అందించడం తప్పా అని ప్రశ్నించారు. రాజ్యసభ, ఎమ్మెల్సీల భర్తీల్లో సామాజిక న్యాయం పాటించింది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. చంద్రబాబు దళితద్రోహి అని విమర్శించారు.

పవన్ రాజకీయాల్లోకి ఎందుకు వచ్చారో..

కనీస అవగాహన లేని పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి ఎందుకు వచ్చారో అర్థం కావడం లేదని నారాయణస్వామి అన్నారు. తన జోలికివస్తే చెప్పుతో కొడతాననడం.. వలంటీర్ వ్యవస్థపై అభ్యంతకర విమర్శలు చేయడం ఏమటని ప్రశ్నించారు. ఒంటరిగా పోటీ చేయమని, ముఖ్యమంత్రిని కాలేనని ఒప్పుకుంటూనే, చంద్రబాబుకు సహకరిస్తున్న పవన్ ఆయనకు దత్తపుత్రుడేనని విమర్శించారు. వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి వెంకటగిరి వస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతన్న నేస్తం పథకం ఐదో విడత ప్రారంభించడం ఇక్కడి వారి అదృష్టమన్నారు. సమష్టి కృషితో ఈనెల 21వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, సీనియర్ నాయకుడు మాదాసు గంగాధరం, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కాభానుప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతుశారద, నేతలు చిట్టేటి హరికృష్ణ, ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, రంగనాథం, కలువాయి జెడ్పీటీసీ సభ్యుడు బి.అనీల్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర సంగీత, నృత్య అకాడమి చైర్‌పర్సన్ పొట్లేళ్ల శిరీష తదితరులు ప్రసంగించారు.

ఉరేసుకుని గుర్తు తెలియని వృద్ధుడు మృతి

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ ఆంజనేయపురం ఫారెస్ట్ చెక్‌పోస్ట్ సమీపంలో ఓ చెట్టుకు వేలాడుతూ గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని బుధవారం పోలీసులు గుర్తించారు. మృతుడు సుమారు 60 సంవత్సరాలు వయస్సు కలిగి ఉంటాడు. తెల్లచొక్కా ధరించి ఉన్నాడు. పంచెతో చెట్టుకు ఉరేసుకుని ఉన్నాడు. మృతుడు ఎవరనేది తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపారు.

పాత నేరస్తుడు అరెస్ట్

- జువైనల్ హోమ్ నుంచి విడుదలైనా దొంగతనాలు
- 55 వేల నగదు, బంగారం, రెండు బైక్‌లు స్వాధీనం


నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ రాజశేఖర్

చంద్రగిరి(తిరుపతి రూరల్): వివిధ నేరాలకు పాల్పడి పరారీలో ఉన్న పాత నేరస్తుడు వెంకటేష్‌ను చంద్రగిరి పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ.55 వేల నగదు, ఎనిమిది గ్రాముల బంగారం, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ వంశీధర్ వివరాలు వెల్లడించారు. పెనుమూరుకు చెందిన వెంకటేష్ (28) చిన్నతనం నుంచే దొంగతనాలకు పాల్పడుతూ జువైనల్ హోం వెళ్లాడు. శిక్ష అనుభవించి అక్కడి నుంచి వచ్చిన తర్వాత కూడా తన ప్రవర్తనలో మార్పు రాలేదు. అగరాల గ్రామంలోని ఓ దేవాలయంలో చోరీ, మరో ప్రాంతంలో చైన్ స్నాచింగ్, రెండు చోట్ల రెండు బైకులు దొంగతనం కేసులో నిందితుడు. బుధవారం ఉదయం రంగంపేట క్రాస్ వద్ద అనుమానస్పదంగా ఉన్న ఇతన్ని చంద్రగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

మోహిత్‌రెడ్డికి అడుగడుగునా బ్రహ్మరథం

- పాకాల మండలం పంటపల్లెలో మహా పాదయాత్ర
- హారతులతో ఆత్మీయ స్వాగతం పలికిన గ్రామస్తులు


మోహిత్‌రెడ్డిని పూలతో ఆత్మీయ స్వాగతం పలుకుతున్న మహిళలు

పాకాల : మండలంలోని పంటపల్లె పంచాయతీలో వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. బుధవారం పంటపల్లె పంచాయతీలో మోహిత్‌రెడ్డి గడప గడపకు మహా పాదయాత్ర సాగింది. ఇంటింటికీ వెళ్లి ఆయన ప్రజలతో మమేకమయ్యారు. పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు వస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న పాలనలో రామరాజ్యం

ముఖ్యమంత్రి జగనన్న పాలనలో ప్రజలు రామరాజ్యాన్ని చూస్తున్నారని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకంతో మహిళలను ఆర్థికంగా బలపడుతున్నారని తెలిపారు. హామీలను నెరవేర్చిన ఏకైక సీఎంగా జగనన్న చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. అద్భుతమైన పథకాల అమలుతో రాష్ట్రంలో జనరంజక పాలన కొనసాగుతోందని తెలిపారు. ప్రజలంతా జగనన్న వైపే ఉన్నారని, రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో విజయం తథ్యమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన కుటుంబసభ్యుల కంటే నియోజకవర్గ ప్రజలనే ఎక్కువగా అభిమానిస్తారని వివరించారు. నిరంతరం ప్రజల కోసం ఏదో ఒకటి చేయాలనే తపనతో పని చేసే వ్యక్తి మన ఎమ్మెల్యే అని గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో చంద్రగిరి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, తనను ఆశీర్వదించి గెలిపించాలని మోహిత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ లోకనాథం, వైఎస్సార్ సీపీ కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, నాయకులు వల్లివేడు విక్రమ్‌రెడ్డి, మునీశ్వర్ రెడ్డి, రఘుపతి, కపిలేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పక్కా ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి

- కలెక్టరేట్‌లో ఓటర్ల జాబితాపై సమీక్ష
- హాజరైన వివిధ పార్టీల నేతలు, అధికారులు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: ఎన్నికల కమిషన్ జారీ చేసిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ-2024 ఉత్తర్వులను అనుసరించి నవీకరణ పటిష్టంగా చేపట్టడంతోపాటు కచ్చితమైన జాబితాను రూపొందిస్తున్నట్లు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. 2024 జనవరి 5వ తేదీ నాటికి తుది జాబితా వెలువడుతుందని వెల్లడించారు. ఈ క్రమంలో అన్ని రాజకీయ పార్టీల నేతలు స్పష్టమైన జాబితాను తయారీకి అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో ఈఆర్‌ఓలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే బీఎల్‌ఓల నియామకం పూర్తి చేసి ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ-2024పై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఎస్ఎస్ఆర్ 2024 మేరకు ప్రతి గడపకు వెళ్లి బీఎల్వోలు సర్వే నిర్వహించి ఓటర్ల జాబితా పరిశీలించనున్నారని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో తప్పని సరిగా బీఎల్ ఏలను రాజకీయ పార్టీలు నియమించుకుని, సత్వరమే జాబితాలను సదరు ఈఆర్ఓ లకు అందించాలని సూచించారు. ఓటర్ల చేర్పులు, తొలగింపులు, సవరణలకు సంబంధించి తప్పనిసరిగా సంబంధిత ఫారం 6, 7, 8 లను సేకరించాల్సి ఉంటుందని తెలిపారు. బీఎల్‌వోల పరిశీలన పూర్తయిన తర్వాత ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 29 వరకు జాబితా సవరణ, అవసరమైన చోట పోలింగ్ కేంద్రాల మార్పుల ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని వివరించారు. ముసాయిదా జాబితా అక్టోబర్ 17న, తర్వాత నవంబర్ 30 వరకు మార్పులు చేర్పులు, పూర్తిస్థాయిలో సవరించిన ఓటర్ల జాబితాను 2024 జనవరి 5న ప్రచురించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు.ఈఆర్‌ఓలు హరిత(తిరుపతి), కోదండరామిరెడ్డి(వెంకటగిరి), కనక నరసారెడ్డి(చంద్రగిరి), రామారావు(శ్రీకాళహస్తి), నగరపాలక డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, టీడీపీ ప్రతినిధులు పులివర్తి సుధారాణి, నరసింహ యాదవ్, రజనీకాంత్, సీపీఐ మురళి, సీపీఎం నాగరాజు, ఏఈఆర్వోలు, కలెక్టరేట్ ఎన్నికల తహసీల్దార్ సురేష్ , ఎన్నికల డీటీలు జీవన్, కిరణ్మయి, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ స్వాహాపై కార్మికుల ఆందోళన


ఆందోళన చేస్తున్న కార్మికులు

రేణిగుంట: రేణిగుంట పట్టణంలో పనిచేసే కార్మికులకు చెందిన పీఎఫ్ మొత్తం రూ.13లక్షలు గత కార్యదర్శి స్వాహా చేశారని, తమకు వెంటనే బకాయిలను చెల్లించాలని కార్మికులు పంచాయతీ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేశారు. పంచాయతీ కార్మికులకు చెందిన 20 నెలల పీఎఫ్ మొత్తాన్ని, బకాయి ఉన్న రెండు నెలల వేతనాన్ని వెంటనే చెల్లించాలని ఆందోళన చేపట్టారు. కార్యదర్శిపై చర్యలు తీసుకుని పీఎఫ్ మొత్తాన్ని వసూలు చేయించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆదేశాలతో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి చొరవ తీసుకుని కార్మికులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి ఆందోళన విరమింపజేశారు. అనంతరం గత కార్యదర్శి విజయభాస్కర్‌ను ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి పిలిపించి కార్మికుల పీఎఫ్ నిధుల గురించి ఆరా తీశారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

తడ: రెండు వేర్వేరు సంఘటనల్లో ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందిన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ జేపీ శ్రీనివాసరెడ్డి కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం ఆరంబాకం సమీపంలోని బాటకుప్పానికి చెందిన వీ అరుళ్(37) శ్రీసిటీలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఈనెల 9వ తేదీన గ్రామానికి సమీపంలోని బీవీపాళెం చెక్‌పోస్టు వద్ద ఓ హోటల్‌లో మధ్యాహ్నం భోజనం తిని జాతీయ రహదారి పక్కన నడుచుకుంటూ ఇంటికి వెళుతుండగా చెన్నై వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అరుళ్‌ని స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు హుటా హుటిన చెన్నై స్టాన్లీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పురుగు మందు తాగి మహిళ

మండలంలోని రామాపురం పంచాయతీ, స్వామిరెడ్డి కండ్రిగ గ్రామానికి చెందిన తెరాపాళెం సెల్వి(30)కి అదేగ్రామానికి చెందిన దొరైతో 11 సంవత్సరాల క్రితం వివాహమైంది. ఇద్దరు సంతానం ఉన్నారు. మద్యానికి బానిసైన దొరైను భార్య మందలించే క్రమంలో తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి. సెల్వి అమ్మ జ్యోతి ఏడాది క్రితం వచ్చి అక్కడే ఉంటూ ఇద్దరి మధ్య వివాదం సద్దుబాటు చేసేది. ఈ క్రమంలో ఈ నెల 16వ తేదీన దొరై మద్యం మత్తులో ఇంటికి రావడంతో భార్యాభర్తల మధ్య వివాదం నెలకొంది. దీంతో మనస్తాపానికి గురైన సెల్వి ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన తల్లి స్థానికుల సాయంతో తొలుత ఎళావూరు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి అనంతరం చెన్నై స్టాన్లీ ఆస్పత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందూతూ బుధవారం తెల్లవారు జామున సెల్వి మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షిరిడీ ఎక్స్‌ప్రెస్‌కు కుప్పంలో స్టాపింగ్

కుప్పం: చెన్నై నుంచి కుప్పం మీదుగా షిరిడీ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు కుప్పంలో ఆపేందుకు రైల్వే శాఖ నుంచి అనుమతులు వచ్చినట్లు సాయిమాత సేవాట్రస్టు వ్యవస్థాపకుడు జగదీష్ బాబు తెలిపారు. కొన్నిఏళ్లుగా షిరిడీ ఎస్స్‌ప్రెస్‌ను కుప్పంలో ఆపాలని ఈ ప్రాంత వాసులు కేంద్ర రైల్వేమంత్రి, జనరల్ మేనేజర్, డీఆర్ఎంలు, ఉన్నతస్థాయి అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారన్నారు. షిరిడీ ఎక్స్ ప్రెస్ ఆపేందుకు అనుమతులు ఇవ్వడం హర్షణీయమన్నారు. ఇందుకు కృషి చేసిన చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పట్టాలు తప్పిన 'పద్మావతి'

- 2.30 గంటలు ఆలస్యంగా రైళ్ల రాకపోకలు
- అవస్థలు పడిన ప్రయాణికులు


రైళ్ల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

తిరుపతి అర్బన్: తిరుపతిలో బుధవారం మధ్యాహ్నం రైల్వే స్టేషన్ యార్డ్ నుంచి వస్తున్న పద్మావతీ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. దీంతో గంటపాటు పలు రైలు రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో ప్రయాణికులు ఇక్కట్లు పట్టారు. ఉదయం 11.30గంటల సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. నాలుగు గంటల పాటు శ్రమించి రైల్వే అధికారులు లైన్ క్లీయర్ చేశారు. ఈ క్రమంలో రాయలసీమ ఎక్స్‌ప్రెస్, పద్మావతి ఎక్స్‌ప్రెస్‌కు 2.30 గంటలపాటు ఆలస్యంగా నడిచాయి. సాదారణంగా రాయలసీమ ఎక్స్‌ప్రెస్(12793) తిరుపతి టూ నిజామాబాద్‌కు తిరుపతి నుంచి సాయంత్రం 5.30 గంటల సమయంలో వెళ్లాల్సి ఉంది. రాత్రి 8గంటలకు ఇది బయలుదేరింది. పద్మావతి ఎక్స్‌ప్రెస్(12763) తిరుపతి నుంచి సాయంత్రం 4.55 గంటలకు వెళ్లాల్సి ఉండగా, అయితే రాత్రి 7.45 గంటలకు బయలుదేరింది. ముందే తిరుపతి రైల్వే స్టేషన్‌లో ఆధునీకీకరణ పనులు జోరుగా జరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు వెయిటింగ్‌కు అవసరమైన సౌకర్యాలు లేకపోవడంతో నానా ఇక్కట్లు పడ్డారు. దానికితోడు గంటల కొద్ది ఆలస్యం కావడంతో నానా అవస్థలు ఎదుర్కొన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్ మేనేజర్ చిన్నరెడ్డెప్ప దీనిపై వివరణ ఇస్తూ యార్డ్ నుంచి వస్తున్న పద్మావతీ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిందని చెప్పారు. వెంటనే ఉద్యోగులు సమస్యను పరిష్కరించారని వెల్లడించారు. కొంత మేరకు రైళ్ల రాకపోకల్లో ఆలస్యం తప్పలేదని వెల్లడించారు. మరోసారి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.